క్లుప్తంగా

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన సైతం చేపట్టనున్నట్లు భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ దేవరకొండ పట్టణంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వస్కుల సుధాకర్, అంకూరి నర్సింహ, జల్లా భాస్కర్, చండీశ్వర్, గుండాల అంజయ్య, పగిళ్ల రాము, ఇడెం రవి, తదితరులున్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

డిండి : మండల పరిధిలోని ఖానాపూర్‌లో సోమవారం ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వర రావు, పల్లా నర్సింహ్మారెడ్డి, తూం బుచ్చిరెడ్డి, మైనొద్దిన్, విజయేందర్‌రెడ్డి, వెంకటయ్య, అంతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ ఆయకట్టులో చెరువులు నింపాలి

గుర్రంపోడు : మండలంలోని ఏఎమ్మార్పీ ఆయకట్టులోని చెరువులు, కుంటలను నింపాలని సీపీఐ మండల కార్యదర్శి రేపాక లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయకట్టుకు నీరు అవసరం లేని ప్రస్తుత సమయంలోనే త్వరగా చెరువులు నిండటానికి వీలుంటుందన్నారు. గేట్లు అన్ని మూసి పానగల్‌కు నీటిని తరలిస్తూ ఇక్కడి చెరువులు, కుంటల గురించి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆయకట్టులో భూగర్భజలాలు పెరిగేలా చెరువులు నింపాలని కోరారు.

కళాభారతి నిర్మించాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కవులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళాభారతి నిర్మాణం చేపట్టాలని కోరుతూ నల్లగొండకు చెందిన కవులు కళాకారులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నల్లగొండలో గతంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి టౌన్ హాల్ ఉండేదని, అది శిథిలం కావడంతో నేలమట్టం చేశారని, ప్రస్తుతం సాహిత్య సభలు నిర్వహించుకోవడానికి తగిన వేదిక లేదని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ళ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామకోటి ఆలయంలో వాసవీమాత కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 108 రకాల చీరలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఓరుగంటి పరమేష్, కన్వీనర్ ఓరుగంటి కరుణ, ఏచూరి ధృవకుమార్, గజ్జల వెంకటేశ్వర్లు, కుక్కడపు శ్రీనివాస్, విశ్వప్రసాద్, రేపాల భద్రాద్రి రాములు, పారేపల్లి శ్రీనివాస్, బందారు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: పట్టణంలో సోమవారం మృతి చెందిన గందె అనసూర్య అనే వృద్ధురాలి నేత్రాలను మృతురాలి కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబల్ ట్రస్టు ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు సేకరించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత

- స్లాబ్ దశలో ఆగిన సమీకృత మార్కెట్ పనులు
- శిలాఫలకానికే పరిమితమైన భవనాలు



స్లాబ్ లెవల్‌లోనే ఆగిన సమీకృత మార్కెట్



మోడరన్ దోబీఘాట్ శిలాఫలకం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలో నిధుల కొరతతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గత ప్రభుత్వం నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలనీలను మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించింది. ఎస్‌డీఎఫ్ నిధుల కింద సుమారుగా రూ.25కోట్లు కేటాయించింది. ధ్వంసమైన రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు వేసేందుకు హిల్ కాలనీ, పైలాన్ కాలనీలకు రూ.8కోట్లు, పైలాన్ సాగర్ ప్రాజెక్టు ప్రధాన ముఖద్వారం(పైలాన్ పిల్లర్)నుంచి హైదరాబాద్ –మాచర్ల రహదారి(జెన్‌కో అతిథి గృహం) వరకు 60ఫీట్ల రోడ్లు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.9కోట్లు మంజూరు చేసింది. రెండు కాలనీల్లో రోడ్లు చాలావరకు పూర్తయ్యాయి.పైలాన్‌లో 60ఫీట్ల రోడ్డు వేస్తే షాపులు కొంత మేరకు పోతాయని స్థానికులు కోర్టుకు వెళ్లారు. ఒక కేసు కొటివేసే వరకు మరొకరు ఇలా కేసులు వేస్తు వెళ్లారు చివరకు కోర్టులో కేసులన్ని కొట్టి వేశారు. ఈ లోగా ఆ ప్రభుత్వం మారింది. దీంతో రోడ్డు పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుపై పడిన గుంతలు పూడ్చుతూ వస్తుంది. వర్షాల రాకతో ఆమట్టి కొట్టుక పోయి తిరిగి పూర్వస్థితికి వచ్చింది. ఆ నిధులతోనే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డును తగ్గించి వేస్తామని ఎలక్షన్ల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే హామీఇచ్చారు. త్వరలో రోడ్డుపనులు మొదలవుతాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అలాగే రెండు కోట్లతో మోడరన్ దోబీఘాట్స్ నిర్మాణానికి నిధులు కేటాయించి సాగర్ జలాశయంతీరం వెంట ప్రధాన రహదారిని ఆనుకోని శిలాఫలకం వేశారు.

స్లాబ్ లెవల్‌లో సమీకృత మార్కెట్ పనులు

కూరగాయలు,పండ్లు,మాంసం,ఉత్పత్తులు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేసి కొంత మేరకు భవనం నిర్మాణం చేశారు. మున్సిపాలిటీలలో విక్రయాలకు అనువుగా స్టాళ్లు ఉండేలా నిర్మాణాలు జరిగాయి. ప్రభుత్వం మారడంతో స్లాబ్ లెవల్‌లో పనులు ఆగిపోయాయి.కోటి రూపాలయతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు నిధులు కెటాయించారు. ఆపనులు మొదలు కాలేదు. రూ.4.5కోట్లతో పైలాన్‌కాలనీలోని పాత బస్టాండులో ఆడిటోరియం నిర్మాణానికి నిధులు ఏటాయించారు. ఈ నిధులను మరో పనికి మళ్లించాలని ఆనాటి ప్రభుత్వమే భావించింది. ఏ పనులు మొదలు కాలేదు.సుమారు కోటి రూపాయలతో వైకుంఠదామం పనులు చేశారు.కోటి రూపాయలతో పైలాన్ బాస్టండు అభివృద్ధిపనులను మమ అనిపించారు. 1.5కోట్లతో పైలాన్‌లో షాపింగ్ కాంప్లెక్సు పనులకు నిధులు మంజూరు చేశారు. ఆపనులు మొదలు కాలేదు. ఈ విదంగా నిధులు లేకపోవడంతో చాలావరకు అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం నిధులు కెటాయించి ఈ పనులన్నింటిని పూర్తి చేయాలని కోరుతున్నారు.

> **నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం**
>
> దోభీ ఘాటు ఇప్పిటికే రద్దు అయింది. పైలాన్ కాలనీలో రూ.8కోట్ల రోడ్డుకు టెంటర్లు పిలవనున్నారు. సమీకృత మార్కెట్‌కు నిధులు వస్తే పనులు ప్రారంభిస్తాం.
>
> – శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం

నిడమనూరు : రైతులు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం సూచించారు. సోమవారం × రైతు ముంగిట్లో– శాస్త్రవేత్తలు× కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం కంపాసాగర్ దగ్గరలో ఉన్నందున మేలైన విత్తనాలు అందించి, వరిలో అధిక దిగుబడి సాధించేలా రైతులకు సలహాలు, సూచనలు మేలైన వంగడాలు అందించాలని కోరారు. కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ లింగయ్య మాట్లాడారు. పరిశోధన స్థానంలో అభివృద్ధి చేసిన వరి వంగాడాలను వివరించారు. వరి సాగులో యూరియా వాడకం తగ్గించి సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. పురుగుమందుల వాడకంలో పలు సలహాలు, సూచనలు చేశారు. సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని పలు యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వి శ్రీధర్ పంట మార్పిడి, నేల ఆరోగ్యం, ఆపరాల సాగు వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మునికృష్ణయ్య ఏఈఓ విజయ్, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, రైతులు వున్నం సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వీరభద్రారావు, వెంకటేశ్వర్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

మిర్యాలగూడ : గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు డ్రా తీశారని, వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని సోమవారం లబ్ధిదారులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు డ్రాలో పేరు వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇళ్లు కేటాయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పట్టణంలో సుమారు 566 ఇండ్లు నిర్మాణం చేసి సిద్ధంగా ఉన్నప్పటికీ ఇళ్లు కేటాయించడం లేదని వాపోయారు. కొత్త ప్రభుత్వం వచ్చాక మరికొంత మందిని ఎంపిక చేసి గతంలో ఎంపికైన వారిని తొలగిస్తున్నారన్న సమాచారం మేరకు ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రాలో పేరు వచ్చిన వారందరికీ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాజర్‌వలీ, నస్రీన్, రేష్మా, రేహాన, బ్రుహాన్, రహీమున్నీసా తదితరులు ఉన్నారు.

రెడ్డీస్ ల్యాబ్ పైప్‌లైన్ పనులు అడ్డగింత

- పెద్దదేవులపల్లికి తాగునీరందించాలని డిమాండ్



పెద్దదేవుల పల్లి రిజర్వాయర్ వద్ద పైప్‌లైన్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

త్రిపురారం : పెద్దదేవులపల్లి రిజర్వాయర్ వద్ద రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం పరిశ్రమకు నీటిని తరలింపునకు నిర్మిస్తున్న నూతన వాటర్ పైప్‌లైను పనులను సోమవారం ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పెద్దదేవుల పల్లి గ్రామానికి ఒప్పందం ప్రకారం మంచి నీరు అందించాల్సిన బాధ్యత ఉన్నా డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్నారు. గ్రామంలో కలుషిత నీటి వల్ల ఆనారోగ్యాలకు గురవుతున్నామని ఆరోపించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమ వల్ల గ్రామంలో గ్రౌండ్ వాటర్ పూర్తిగా కెమికల్ వాటర్‌గా మారిందని, బోర్లు వేసుకునే పరిస్థితి లేదని చెరువు నీటిపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. 30 ఏళ్ల కిందట ల్యాబ్ వాళ్లు వేసిన పైప్‌లైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామానికి నీరు సరఫరాల సరిగా కావడం లేదన్నారు. గ్రామానికి మంచి నీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ల్యాబ్ యాజమాన్యం దృష్టికి ఐదేళ్ల నుంచి తీసుకెళ్తున్నా పైప్‌లైన్‌కు అనుమతులు రావాలంటూ దాటవేసినట్లు ఆరోపించారు. కాని ఇప్పుడు పరిశ్రమకు నీటిని తరలించుకోవడానికి ఎలా అనుమతి వచ్చిందని నిలదీశారు. పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి ఇష్టమొచ్చినట్లు పెప్‌లైన్లు వేయడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు గ్రామంలో పర్యటించి గ్రామానికి మంచి నీరు అందించిన తరువాతనే రిజర్వాయర్ నుంచి ల్యాబ్ నీరు తీసుకెళ్లాలని, లేకపోతే గ్రామస్తులందరం నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలపై మిర్యాలగూడ వాసుల ప్రదర్శన

మిర్యాలగూడ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు సానుభూతిగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన నిరసన ప్రదర్శనలో మిర్యాలగూడ వాసులు పాల్గొన్నారు. మిర్యాలగూడకు చెందిన భారత్ బచావో ఆందోళన్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, సభ్యులు పి.అజయ్‌కుమార్, నీలు, విశాల్‌లు ప్లకార్డులు చేతబట్టి ప్రదర్శనలో పాల్గొన్నారు. మృతికి నిధులు ఆపండి, ఫాసిస్ట్ శక్తులను ఎదుర్కొవాలి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, గాజాపై దాడులు ఆపాలని, నిరంకుశ విధానాలు ఆపాలని ప్లకార్డులు ప్రదర్శించారు.



శాన్‌ఫ్రాన్సిస్కోలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మిర్యాలగూడ వాసులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



దేవరకొండ : మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్: సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

దేవరకొండ : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండ పట్టణంలో జరిగిన ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సులో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కోడ్‌లుగా విభజించి కార్మికులపై మళ్లీ ఒత్తిడి తెచ్చేందుకు 12గంటల పని రోజులు అమలు పర్చేందుకు చట్టాన్ని అమలు చేయాలని చూస్తుందని ఆయన విమర్శించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతన చట్టాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, నల్ల వెంకటయ్య, పొట్టిపాక మురళీకృష్ణ, ఏపూరి కృష్ణయ్య, యాదగిరి, నాగరాజు, సర్దార్, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

మిర్యాలగూడ టౌన్ : ఈ నెల 20న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా చేపట్టనున్నట సార్వత్రిక సమ్మెకు సంబంధించిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నోటీసును సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ రేఖల మమతకు అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బొందు పార్వతి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనయన్ జిల్లా కమిటీ సభ్యులు ప్రమీల, స్వరాజ్యం, సైదమ్మ, తూడి అరుణ, రశీద, విజయలక్ష్మి, విజయ, రాధా బాయి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వే



వివరాలు నమోదు చేసుకుంటున్న ఉద్యోగి

నిడమనూరు : రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో ఇందిరమ్మ గ్రామసభలలో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి వద్దకు వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం శాఖాపురం, బంకాపురం , మవారిగూడెంతోపాటు పలు గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వే కొనసాగింది. ప్రతి కుటుంబంలోని సభ్యుల వివరాలు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రధానంగా నూతన కుటుంబాలు, పేర్లు నమోదు, తొలగింపు వివరాలు సేకరిస్తున్నారు. కూతరు కానీ, కుమారుడు పెళ్లి అనంతరం కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే అంతకుముందున్న కార్డులో పేరు తొలగించుకొని కొత్త కార్డుకోసం వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

తాగునీరు వృథా..

- సాగర్ నీటితో వాహనాలను కడుగుతున్న వైనం
- వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరతున్న ప్రజలు



సాగర్ నీటితో కారును కడుగుతున్న వాహనదారుడు

మిర్యాలగూడ అర్బన్ : ప్రజల తాగు నీటి అవరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు పట్టణంలోని సుందరయ్య పార్కు వద్ద (సాగర్‌నీరు) మంచినీటి నల్లాను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోని అనేక కాలనీల నుంచి ఆ నల్లా వద్ద నీటిని పట్టుకునేందుకు భారీగా వస్తుంటారు. ఆ ప్రాంతంలో తాగునీటి నల్లా ఏర్పాటు చేయడంతో ఒక్కోసారి తమ కాలనీలో నల్లానీరు రాకుంటే ఇక్కడికి వచ్చి తాగునీటిని తీసుకెళ్తుంటారు. కొంతమంది వాహనాదారులు ఆ తాగునీటిని తమ వాహనాలను కడిగేందుకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రతి రోజు కార్లు, ప్రైవేట్ బస్సులు, ఆటోలను సైతం కడుగుతూ తాగునీటిని వృథా చేస్తున్నారు. తాగునీటి క్యాన్లు తీసుకొని వచ్చిన కొందరు ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై దుర్భాషలాడుతూ కొట్టేందుకు సైతం వెనుకాడటం లేదని పలువురు ఆవేదనతో తెలిపారు. రాత్రి సమయంలో మందుబాబులు సైతం ఆ మంచినీటి నల్లా వద్ద ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. కొందరు ఉదయం వాకింగ్ వచ్చేవారు సైతం ఆ మంచినీటి నాల్లా వద్ద స్నానాలు సైతం చేసే విధంగా కడుగుతూ మంచినీటిని వృథా చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి మంచినీటితో కార్లు ఇతర వాహనాలు కడిగే వారిని గుర్తించాలని పట్టన ప్రజలు కోరుతున్నారు.

పల్లె దవాఖాన తనిఖీ



పల్లె దవాఖానాలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ కళ్యాణ్ చక్రవర్తి

చింతపల్లి : మండలంలోనీ వీటి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోలేపల్లి రాంనగర్ పల్లె దవాఖానను డిప్యూటీ డీఎంహెచ్ఓ సోమవారం తనిఖీ చేశారు. పల్లె దవాఖానను వైద్యులు లేక మూసివేస్తుండడంతో శనివారం 'సాక్షి' దినపత్రికలో 'తెరుచుకోని పల్లె దవాఖానాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ కళ్యాణ్ చక్రవర్తి స్పందించి పల్లె దవాఖానను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఏఎన్ఎంకు మెమో జారీ చేయాలని విటీ నగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీ కృష్ణకు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, దవాఖానకు వచ్చే రోగులపై నిర్లక్ష్యం వర్తన లేకుండా నాణ్యమైన వైద్యం అందించని ఎంతటి వారినైనా ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. వారి వెంట వీటీ నగర్ వైద్యాధికారి వంశీ కృష్ణ, హెచ్ఓ వీవీ చారి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ముత్యాలమ్మ అనుగ్రహం పొందాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : గ్రామదేవత ముత్యాలమ్మ అనుగ్రహం పొందాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని ముడుదండ్ల గ్రామంలో ముత్యాలమ్మ , ఈదమ్మ, ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ సహిత, గ్రామ బొడ్రాయి (నాభిశిల) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరాజ్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు జర్పుల బద్యానాయక్, వేణుధర్‌రెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్, గోవిందుయాదవ్, సర్వయ్య, మున్నయ్యయాదవ్, శవ్వ నారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మూలమలుపు వద్ద కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

డిండి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ చౌరస్తా వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె ఏర్పాటు చేయలేదు. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ఆ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడ ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిలువ నీడ కరువు!

- అంగడిపేట చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు
- ఎండలోనే ప్రయాణికుల పడిగాపులు
- బస్ షెల్టర్ నిర్మించాలని వేడుకోలు



అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఎండలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

పెద్దఅడిశర్లపల్లి : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆర్టీసీ చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితం అవుతున్నాయి. బస్ చార్జీలు, ఇతర రూపాల్లో లక్షలాదిరూపాయల ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలం అవుతుంది. మండల పరిధిలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణికులు నిలబడేందుకు కనీసం బస్ షెల్టర్ లేకపోవడంతో డబ్బా కొట్లు, షాపుల నీడలోనే ప్రయాణికులు వేచి ఉటున్నారు. హైదరాబాద్– నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఉన్న ఈ ఎక్స్ రోడ్డు గుండా నిత్యం వందలాదిమంది ప్రయాణికులు మండల కేంద్రం, దుగ్యాల, తిరుమలగిరి, వద్దిపట్ల, గుడిపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ, నల్లగొండ, హైదరాబాద్, పెద్దవూర, హాలియా, సాగర్‌లకు ప్రయాణిస్తుంటారు. ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు ఇక్కడి నుంచి వెళ్తుంది. దీంతో ఆర్టీసీకి ఆదాయం సైతం బాగానే ఉంటుంది. పలు పట్టణాలకు వెళ్లే కూడలి కావడంతో ఇక్కడ ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్‌తో పాటు డీలక్స్ బస్సులు కూడా ఆగి ప్రయాణికలను ఎక్కించుకుంటారు. ఇంత రద్దీ ఉన్న ఈ సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటుకు అధికారులు చర్య తీసుకోకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు

ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. వర్షాకాలంలోనైతే ప్రయాణికుల బాధలు వర్ణణాతీతం. వేసవిలో పలువురు ప్రయాణికులు సొమ్మసిల్లి పడిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. వర్షాకాలంలో ఒక వైపు జోరున వర్షం కురుస్తున్నా... మరో వైపు ఎక్కడ బస్సు వెళ్లిపోతుందేమోనన్న ఆరాటం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

> **సొమ్మసిల్లి పడిపోతున్నాం**
>
> 
>
> అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఒక్కోసారి బస్సులు రావడం ఆలస్యమవుతుంది. ఈ సమయంలో గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ఎండ వేడిమికి తాళలేక సొమ్మసిల్లి పడిపోతున్నాం. హైదరాబాద్ – నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారిపై ఉన్నప్పటికీ ఈ స్టేజీ వద్ద బస్ షెల్టర్ నిర్మించకపోవడం బాధాకరం.
>
> – వీరమళ్ల సతీష్‌కుమార్

> **బస్ షెల్టర్ నిర్మించాలి**
>
> 
>
> అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో బస్సుల కోసం ఎండలోనే నిలబడాల్సి వస్తుంది.ఒక వేళ షాపులు ముందు నిలబడదామన్నా యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు .అధికారులు స్పందించి వెంటనే బస్ షెల్టర్ నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలి.
>
> – సభావత్ లోకేష్‌నాయక్, అంగడిపేట తండా